

# కష్టకాలం

డి హనుమంతరావు

రామ్మూర్తికి కష్టకాలం వచ్చింది కష్టాలెప్పుడూ ఒంటరిగా రావుట ఎప్పుడొచ్చినా, జంటలు, గుంపులు, మురాలుగా వస్తుంటాయి

రామ్మూర్తి పనీ అంతే అయింది పెళ్ళయింది సీత కాపరాని కొచ్చింది రమ్మీలో రోజుకు పాతిక రూపాయలదాకా పోతున్నాయి అసలు రోజూ క్లబ్‌కి వెళ్ళడానికే వీలు పట్టంలేదు యిదివరకులాగ అనుకోకుండా ఎప్పుడుపడితే అప్పుడు సినిమాలు జూడ్డం వీలుపడ్డం లేదు ఏ మంచి హోటలుకో పోయి మునుపు వంకరలు చూబెట్టే మంచి మంచి అమ్మాయిల్నీ చూడ వీలుగావడం లేదు యింకా యిలాంటివే రకరకాల కష్టాలు!

రామూర్తి ఆత్మవిశ్వాసం, మనస్థైర్యం వగైరా మంచి గుణాలున్న మనిషి దేవుళ్ళు, దేవతలు, దెయ్యాలు, గ్రహాలు లాంటివంటే వేళాకోళం చేసేవాడు మన భవిష్యత్తు మన చేతిలో వుంది, మనం చేసే పనులబట్టే మనకి జరిగేవన్నీ జరుగుతుంటా యంటూండేవాడు

అలాంటివాడు కాస్తా, యీ కష్టకాలం వచ్చాక, పామాలు, కుంకంబొట్టు దిద్దిన శాస్త్రులు ఒకాయన దగ్గిరకి వెళ్ళి యేవో ఆకులు, పువ్వులు, అంకెలు వగైరా చెప్పి యేంకావున్నదో తెలుసుకోగోరాడంటే పరిస్థితి ఎంత విషమించిందో వూహించవచ్చు. యింతకీ తేలిందేమంటే, రాహువు, కేతువు కలిసి ఒకే యింట్లో మకాంపెట్టి, యెదురింట్లో వున్న శుక్రుణ్ణి చాలా దుష్టంగా చూస్తుండడం వల్ల యీ అనర్థం యేర్పడింది. శుక్రుడు ఆ యిల్లు ఖాళీ జేస్తేనేగాని రోజులు తిరగవు. అతగాడిచేత ఆ యిల్లు ఖాళీ జేయించాలంటే శాస్త్రుల్లాంటి పండితులని భోజన వినోదాల్తో సత్కరించి తృప్తిపరచాలి

వెంటనే రామ్మూర్తి సాసేజెస్, ఆమ్లెట్లు, హాట్ డాగ్స్, యింకా బార్‌బెక్యు వగైరా వగైరా అన్నీ సుబ్బారావు, వెంకట్రావు, కృష్ణమూర్తి సత్యనారాయణ వగైరా మిత్రులకి సుష్టుగా తినిపించాడు. అద్భుత శృంగార భీభత్స రసమయాలైన చలన చిత్రాలు రకరకాల భాషల్లోవి చూబెట్టి తృప్తిపరిచాడు.

యింతజేసినా, శుక్రుడు ఆ యిల్లు ఖాళీ చెయ్యనూలేదు. యువతలవాళ్ళు అలా దిక్కుమాలిన చూపులు చూడ్డం మాననూ లేదు

రామ్మూర్తి సంసారంలో అశాంతి రేకెత్తింది. రాజాలాంటి బ్రహ్మచారి జీవితాన్ని వదిలిపెట్టి, యిందులో యేదో వొలుకుతుందన్నట్టు గంపెడాశతో పెళ్ళాడిన రామ్మూర్తికి యింత త్వరగా యెండమావి తాలూకు కటికనిజం అనుభవంలోకి రావడం భరింప శక్యం గానిదయింది.

రామ్మూర్తి పూర్వాశ్రమంలో కథలు వ్రాసేవాడు. వాటి పూర్వజన్మ సుకృతాన్నిబట్టి కొన్ని అక్కడా యిక్కడా అచ్చుమొగం చూశేవి. కొన్ని చి. కా. బు. (చిత్తు కాగితాల బుట్ట) దాఖలయేవి. వాటి గురించి రామ్మూర్తి యెన్నడూ అంతగా పట్టించుకోలేదు. అయితే, ఒకోసారి మనం యెంతమాత్రం పట్టించుకోనివే, మనని చాలా గట్టిగా పట్టుకుంటూంటాయి.

"కథ చెప్పండీ!" అంటుంది సీత యిద్దరూ ఏకాంతంలో ఏవెన్నెలరాత్రో, ఏ నీరెండలసాయంకాలమో లాన్లో కూర్చొని ఉన్నవేళ, యింకేం మాట్లాడాలో తోచనప్పుడు.

ఆ సాయంకాలమూ అలాగే అడిగింది. వెన్నెల వచ్చింది. నిలువెత్తు చుట్టూ లేచిన హెడ్జింగ్ చాటు లాన్లో మల్లెపందిరి క్రింద గార్డెన్‌చెయిర్స్ వేసుక్కూర్చున్నా రిద్దరూ.

"కథ చెప్పరూ!"

రామూర్తి మొదలు పెట్టాడు.

"ఒక మంచమ్మాయి. ఆ మంచి అమ్మాయికి అంత మంచివాడు గాని మొగుడు. అయినా ఆ అమ్మాయి 'మొగుడు యీజీక్వల్టు దేవుడు' అని నమ్ముకొని, అప్పుడప్పుడు ఆ నమ్మకం ప్రకటిస్తూ వీణమీద, దొరికితే పియానో మీద పాటలు కూడా పాడేది. యిలా బృందావన్ గార్డెన్సు లాగ, సిమ్స్ పార్కు లాగ, పబ్లిక్‌గార్డెన్స్ లాగ గడిచిపోతున్న వాళ్ళ జీవితంలోకి ఆ అబ్బాయి ఆప్తమిత్రుడొకడు ప్రవేశించాడు!"

"అక్కడికి త్రిభుజం పూర్తయిందన్నమాట!"

"త్రిభుజమో, చతుర్భుజమో నీకప్పుడే యేం తెలుసు? అడ్డు చెప్పకుండా విను ఆ రెండో అబ్బాయి మహా గొప్పవాడు, ఉత్తముడు పురాణాల్లో ఏ దేవుడ్నో పట్టుకొని పాంటు, చొక్కా తొడిగి, క్రాపు పెట్టి యీలోకంమీదికి తోలేస్తే యెలా వుంటుంది? అంత మంచివాడు మొదటి అబ్బాయికి యితనంటే అయిదు ప్రాణాలూను. యిద్దరూ గోళీ కాయల రోజుల్నుంచీ చాలా సన్నిహితంగా ఉండేవారు"

"ఆ అబ్బాయి మరింతకాలం యెక్కడున్నాట్ట?"

"యెక్కడో టింబక్టూలో! అది కథకనవసరం కాని కథకోసం సమయానికొచ్చి అదుకున్నాడు వీళ్ళ ఊర్లోనే మకాం. రోజూ వీళ్ళింట్లోనే కాలక్షేపం అతని మంచి లక్షణాలన్ని చూసి యీ మంచి అమ్మాయి అతనంటే మంచి అభిప్రాయం యేర్పర్చుకుంది. అది ఉత్తసోదర ప్రేమ అన్న సంగతి ఆమె భర్తకి అర్థం కాలేదు. కిట్టని వాళ్ళు చెప్పిన మాటలుబట్టీ వాళ్ళ సంభాషణల్లో కొనమాటలు విని, అతని స్నేహితుడు ఆమెని ఏ తేలునుంచో, పామునుంచో రక్షిస్తూండడం చూసి, ఆమె ననుమానించాడు. అజ్ఞానంతో అసూయ పడ్డాడు. యింక అక్క

కున్నంది పౌర్ణమి రాత్రి లాంటి వాళ్ళ సంసారంలోకి కారు మబ్బులు కమ్ముకు రాసాగాయి. ఆతని కసి అంతా స్నేహితుడి మీద తీర్చుకోలేక ఆమె మీద తీర్చుకో సాగాడు."

"మరి యీ రెండో అబ్బాయికి పెళ్ళాం, పిల్లలు, సంసారం యేం లేవేమిటి? అన్నమానం పెళ్ళింటికొచ్చి కూర్చోడ మెందుకు?''

"ఆ అబ్బాయి ఆ జీవితాంతం బ్రహ్మచారిగా ఉండి పోతానని ప్రతిన బట్టాడు. అందుకు కారణాలు చాలా ఉన్నాయి. అదింకో కథ."

"ముందా కథ చెప్పండి''.

"ఆకథ, తర్వాత యింకోసారెప్పుడైనా.యివాళ్టికీ కథగాదీ. యిందులో శోకరసం అద్భుతంగా పోషింప బడింది. రొంప లేకపోయినా కళ్ళంట, ముక్కంట తెగ కారుతాయి నీళ్ళు!"

"నాకే రసమూ వొద్దు, సాంబారూవద్దు. ఆకథ కావాలి.''

రామ్మూర్తి కథ మార్చక తప్పింది గాదు.

"స్థలం చాణక్యపురి. సమయం, రంగురంగుల పోయింకాలం. పాత్రలు ఓ మంచి అమ్మాయి, ఇంకా మంచి అబ్బాయి. ఆ అమ్మాయిని చూసి రతీదేవి తల దించుకోవాలి. ఆమె గొంతు విప్పితే కోకిల సిగ్గుపడుతుంది. పుస్తకాలు చదువు తుంది, వ్రాస్తుంది. పాటలు పాడుతుంది. వ్రాస్తుంది. అలాగని గర్వం గ్రాము కూడా లేదు. శుభ్రంగా వంట చేస్తుంది. కష్టాలొచ్చి నప్పుడల్లా దేవుడు దగ్గిరకి పరుగెత్తి పాడు తుంది. ముసలి అమ్మ, నాన్న వగైరా యెవ రన్నా వుంటే చక్కగా సేవ జేస్తుంది. యింత మంచి అమ్మాయి, ఆ యింకా మంచి అబ్బాయిని చూడగానే మనసిచ్చి పుచ్చుకుంది. ఆ మంచి అబ్బాయి నిజంగా చాలా మంచివాడు. అద్భు తంగా బొమ్మలు గీస్తాడు. టెన్నిస్‌లో మహా మహావాళ్ళని ఓడించేస్తుంటాడు. పరీక్షల్లో విధిగా ఫస్టు పాసవడం మాత్రమే కాకుండా యింటికి రాగానే వినయంగా వాళ్ళనాన్నకాళ్ళకి వంగి నమస్కరించి, అమ్మని కౌగలించుకొని, అదంతా వాళ్ళ భిక్ష అంటాడు. రోడ్డు మీద పోతూంటే ఎప్పుడైనా ముసలివాళ్ళు, గ్రుడ్డివాళ్ళు, కుంటి వాళ్ళు మరియు ఆడవాళ్ళు ఆపదల్లో యిరుక్కుంటే వెతికి పట్టుకొని రక్షిస్తూం టాడు."

"మీ వర్ణన వింటూంటే నిద్రొస్తోంది! యింతెందుకు? ఆ అమ్మాయి దేశవాళీ సినిమాల్లో హీరోయిన్లాంటిది. ఆ అబ్బాయి పెళ్ళికాని అమ్మా యిల నవలల్లో హీరో అంతటివాడు అంటే సరిపోదూ!'' అంటూ ఆవలించింది సీత.

"అయితే కట్ చేసి చెప్తాను విను. అమ్మా యిది అసలు వూరు కలకత్తా. అబ్బాయిది బొంబాయి.'బొంబాయిలో శివసేనవాళ్ళు యితర రాష్ట్రాలవాళ్ళని రానియ్యరు. ఆ ఊరు అబ్బాయిని కట్టుకొని నువ్వేం సుఖపడతావు?' అని ఆ అమ్మా యిని వాళ నాన్న కూక లేశాడు. కలకత్తాలో రోజూ హర్తాళ్, ఘెరావ్, కాల్పులు వగైరా

# కష్టకాలం

జరుగుతుంటాయి. ఆ ఊరు అమ్మాయిని కట్టు కుంటే ప్రమాదం అన్నాడు అబ్బాయి నాన్న. అందుకని, అమ్మాయి అబ్బాయి కలిసి పారి పోయి, హైద్రాబాద్‌లో పెళ్ళి చేసుకొని అక్కడే సెటిలయిపోవాలని నిర్ణయించు కొని, విమా నానికి టిక్కట్లు కూడా కొనుక్కున్నారు. ఈసంగతి పసిగట్టిన అమ్మాయి నాన్న వెంటనే అమ్మాయిని తీసుకొని తుఫాన్ మెయిలు యెక్కే సాడు. ఆసంగతి తెలియని అబ్బాయి పాపం, పాలం వెళ్ళి ఆఅమ్మాయి కోసం నిరీక్షించి నిరీక్షించి, చివ రికి హతాశుడై యింటి కొచ్చి, వచ్చిన విరహ గేయాలన్ని భాషల్లోనీ పాడి, ఆఖరికి వాళ్ళమ్మ బ్రతిమలాడగా భోజనం చేశాడు. భోజన మయితే చేశాడు గాని పెళ్ళిమాత్రం చేసుకో నన్నాడు. జీవితంలో ఎవరన్నా ఒక్కసారే ప్రేమిస్తారన్న పరమ సత్యాన్ని యింట్లో అమ్మకి నాన్నకి బోధించి, యింకా వాళ్ళు వినకపోతే, పీడ వదుల్చుకోడానికి టింబక్టూ వెళ్ళిపోయాడు. కథ కంచికి. మనం బెడ్ రూంలోకి."

"యింతకీ ఆ అమ్మాయి పేరు రాధేనా?''

రామ్మూర్తి మాట్లాడలేదు. ఏ కథ యెక్కడ యెలా మొదలయినా చివరికి అక్కడే ఆగుతుంది. ఆ మాట వినగానే రామ్మూర్తి గుండెలో బృందావన్ ఎక్స్‌ప్రెస్, డక్కన్ క్వీనూ పోటీలు వేసుకు పరు గెత్తాయి.

రామ్మూర్తి వెన కెప్పుడో వ్రాసిన చాలా కథల్లో నాయిక పేరు రాధ. ఆ రాధ అనేది ఉత్తి నరసమ్మ సుబ్బమ్మ లాంటి పేరేనని, దానికి వేరే ప్రత్యేకత లేదని, బాగుంది గాబట్టి వాడ్డం జరిగిందనీ, అసలా పేరుతో మనిషెవరూ తనకి తెలియదని, రామ్మూర్తి చాలాసార్లు ప్రకటించాడు.

కాని సీత నమ్మదు.

"నేనేం అనుకోన్లెండి. ఆమెవరో యెక్క డుందో చెప్తే చూసి సంతోషిస్తాను. వీలయితే ఆవిడని కలుసుకొని స్నేహంపట్టి, ఆవిడ మంచి గుణాలు కాసిని అలవర్చుకొని తరిస్తాను.'' అంటుంది.

యింకా—

"మీ రెవర్నీ ప్రేమించలేదని నమ్మడానికి నేనేం వెర్రిదాన్నా! ఎనిమిదేళ్ళు కాలేజీలో చది వారు. పెద్ద వక్త. కథలు వ్యాసాలు వ్రాస్తారు. నాటకాల్లో వేషాలు వేశారు. విద్యార్థి నాయకులు. యింతాజేసి, ఏ అమ్మాయినీ ఎరగరని ఎవర్నీ ప్రేమించలేదని ఎలా నమ్మమంటారు?'' అంటుంది.

ఏమని సమాధానం చెప్పడం?

"అన్నట్టు నీతో చదువుకున్న అమ్మాయెవరో, వసంత గదూ, యీ వూరు వచ్చిందన్నావు. ఉందా, వెళ్ళి పోయిందా? ఒకసారి మన యింటికి పిలవ రాదూ?''

"అది వెళ్ళిపోయి రెణ్నెళ్ళయింది. మాట మార్చాలని యెత్తయితే వేశారుగాని, అది నా దగ్గిర పారదు!"

యీ సమస్య రోజురోజుకి విషమంగా పరిణ మించింది. రామ్మూర్తి మనసు చెల్లా చెదరై యిరవై నాలుగ్గంటలూ యీ సంగతే ఆలోచించ సాగాడు.

డాక్టరు సుబ్బారావు రామ్మూర్తికి బాల్య మిత్రుడు. ఎం. బి. బి. యస్. అయ్యాక యింకా రకరకాల డిగ్రీలు, డిప్లొమాలు పొంది, ప్రాక్టీసు అంతగా లేక పుస్తకాలు వ్రాయసాగాడు. ముఖ్యంగా అతను వ్రాసిన "సుఖ సంసారానికి చిట్కాలు" అనే పుస్తకం చాలా ప్రసిద్ధి కెక్కింది. దాంపత్య జీవనం సుఖంగా సాగిపోవాలంటే యేం చెయ్యాలన్న విషయం పైన యెంతో పరిశోధన జేశాడు. అతని సలహా పొంది చాలా మంది దంపతులు తమ విభేదాలు మర్చిపోయి సుఖశాంతులు పొందారు.

రామ్మూర్తి సుబ్బారావు దగ్గిరకి వెళ్ళి తన కొచ్చిన కష్టం చెప్పుకున్నాడు. సుబ్బారావుకి పేషెం ట్ని చూస్తే సరదా. అందులోనూ రామ్మూర్తిని వో స్నేహితుడిగా కాక, రోగిగా చూడగానే యెంతో ఉత్సాహం పుట్టుకొచ్చింది.

"భార్యాభర్తల మధ్య అభిప్రాయ భేదాలు, కలతలు రావడానికి ముఖ్యకారణం, యిద్దరి మధ్య ఎడ్జెస్ట్‌మెంటు, అంటే సర్దుబాటు లేకపోవడం యిది రెండు రకాలు, భౌతికం, మానసికం."

"ప్రస్తుతానికి భౌతికం సంగతి వదిలేసి, మానసికం సంగతి మాట్లాడుకుందాం.''

"యిద్దరు గట్టి వ్యక్తిత్వం ఉన్న మనుష్యుల మధ్య క్లాష్ అంటే వైవిధ్యం రావడం సహజం. మీ శ్రీమతికి ఏమన్నా ఖచ్చితమైన నిశ్చితాభి ప్రాయా లున్నాయా?''

"అలాంటివేం ఉన్నట్టు కనబడదు. సినిమాలు చూడ్డం, కనబడ్డ అడ్డమైన పుస్తకాలూ చద వడం, వంట పేరుతో ప్రయోగాలు చెయ్యడం మధ్య మధ్య జోకుల్లాంటివి వెయ్యడం తప్పించి, యింకే గొడవ అక్కర్లేదు.''

"అయితే సమస్య చాలా సూక్ష్మంగా తేల్చే య్యొచ్చు. చాలా సంసారాల్లో జరిగేదేమంటే భార్యా భర్తలు ఒకర్నొకరు చాలా గాఢంగా ప్రేమించేసు కుంటూన్నా ఆ సంగతి ఒకరికొకరు చెప్పుకోరు. అదే లోపం. ఆమె అంటే నీ కెంతో అభిమానం, అనురాగం, ప్రేమ ఉన్నాయని ఆమెకి తెలియాలి. అందేత వాటిని నువ్వు అడపాదడపా ఆ వైనం ప్రకటించాలి. అంటే ఏ పేపర్లోనో అచ్చేయించ మని కాదు. నీ చర్యలు, చేష్టలు ద్వారా ఆమెకి తెలియజెయ్యాలి. అందుకు రకరకాల మార్గా లున్నాయి. ఒకటి. మొదటి తారీఖున జీతమంతా ఆమె చేతికిచ్చి యింటి నామే నడుపుతున్నట్టు భ్రమ కలగ జెయ్యడం. రెండు, ఆమెని నీతో సమానంగా చూడ్డం. ఎక్కడికన్నా పోతుంటే నువ్వో ఫర్లాంగు ముందు నడిచి ఆమె చేత పరుగు తీయించ గూడదు. నెమ్మదిగా ప్రక్కగా కబుర్లు చెబుతూ గడపాలి. మూడోది ముఖ్యమైనది. ఆమె నిన్ను తన సౌందర్యంతో, గాత్రమాధుర్యంతో సమ్మోహితుణ్ని చేసినట్టు కనబడ్డం. ఏ పార్కు

# కష్టకాలం

లోనో, హోటళ్లలోనో, సినిమాహాల్లోనో నలుగురిమధ్యా ఉన్నప్పుడు, యెంతటి అవసరం యెదురయినా కన్నెత్తి చూడగూడదు. శ్రీమతి చూస్తుండగా. పైగా, ఆమె చేతిని చేతిలోకి తీసుకోడం, కళ్లలోకి నవ్వుతూ చూడ్డం వగైరా చేస్తేయింకా మంచిది. యెవరూ చూడనివేళ, అనుకోకుండా ఆమె చెంపనో, మెడనో యిట్టే పెదాల్తో తాకావనుకో, ఆమె ఆక్షణంలో కొద్దిగా అలగవచ్చు. కాని లోపల్లోపల మురిసిపోతుంది. యింక పుట్టినరోజు, వివాహ వార్షికం లాంటివి విధిగా వైభవంగా సెలిబ్రేట్ చెయ్యాలి. అందులోనూ సర్‌ప్రైజు ఉండాలి. వో వారంరోజులూరించి చివరికి ఏ పీచుమిఠాయో చేతిలో పెడ్తే మజాలేదు. నువ్వే బహూమతిచ్చినా యేం చేసినా ఆమె నాశ్చర్యానందాలో, ముంచెత్తాలి యింక వీటన్నిట్నీ మించి పొలుగోదింకోటుంది. అది పొగడ్త. 'నువ్వు ఓగార్ అంతటివాడివి' అంటే లొంగనివాళ్ళెవరూ లేరు. ఆడవాళ్ళకి అదింకా ముఖ్యం. అడపాదడపా ఆమె అందాన్ని, పాటని, వంటని, నడకని చీరకట్టుని, హెయిర్ స్టయిల్‌ని విశాల హృదయాన్ని, జోక్‌ని చేస్తుయినాసరే మార్చి మార్చి పొగుడుతుండు. యిహచూడు, నీ జీవితంలో మూడు పువ్వులు ఆరు కాయలు పూచి కాయకపోతే నన్నడుగు.."

సుబ్బారావు చాలా హుషారుగా వివరించి, యింకా వివరాలకి తన పుస్తకం చదువుకోమని, 'విత్ ది బెస్ట్ కాంప్లిమెంట్స్' సంతకంపెట్టి యిచ్చాడ.

రామ్మూర్తి ఆ చిట్కాలన్నీ తు.చ. తప్పకుండా అమలు పరిచాడు. ఒక సారి యేదో చిలిపి పని చేసినందుకు సినిమా వదిలిపెట్టి వెళ్లి కారులో కూర్చుంది. యింకా తర్వాత యెప్పుడూ పబ్లిక్ ప్లేస్‌లో అలాంటి పని చెయ్యనని వాగ్దానం చేసిందాకా అతనితో యెక్కడికీ రాలేదు. యింకోసారి యెప్పుడో ఆమె వంట అద్భుతంగా ఉందనీ నలుడు భీముడు లాంటి వాళ్లంతా ఆమె దగ్గిర ప్రైవేటు చెప్పించుకోవాలంటూ పొగిడాడు. ఆరోజు ఆమెవంట పొడ్డై అతనేదో వెక్కిరిస్తున్నాడనుకొని బాధపడి మూడు రోజులు మాట్లాడ్డం మానేసింది.

కష్టాలు గట్టెక్కడం మాటలావుంచి, సుబ్బారావు చిట్కాలు క్రొత్త కష్టాలు తెచ్చి పెట్టాయి.

సుబ్బారావు దగ్గిరకి పరుగెత్తాడు రామ్మూర్తి. కేసులో కాంప్లికేషన్సు వస్తున్నాయంటే సుబ్బారావుకి యెంతో సంబర మేసింది. యిందులో పరిశోధనావకాశాలు చాలా వున్నాయి. యిందులో పరిణామాలన్నీ తన పుస్తకంలో ఓనమూనా కేస్ స్టడీగా యిరికించ వచ్చు.

"ఒరేయ్, రాముడూ, కథ మంచి రొక్తు గడుతోంది. యింతకుముందు నేను చెప్పినవన్నీ ఫెయిలయ్యాయంటే ఆశ్చర్యంగా వుంది. అయినా నిరుత్సాహ పడకు. యిది నీకేగాదు, నాక్కూడా, వోడాక్టరుగా పెద్ద సవాలు. అయితే అంతిమ విజయం మనదేనన్న గాఢ నమ్మకం నాకుంది. మనస్తత్వ శాస్త్ర ప్రకారం, రెండు మార్గాలున్నాయి. ఆ రెంటిలో యే ఒక్కటయినా సరే తప్పక పని చేస్తుంది. అయినా రెండూ చెప్తున్నాను. ఒకటి పని చెయ్యకపోతే, అప్పుడు రెండోది ప్రయోగించు. ఎప్పటికప్పుడు, ఏమవుతుందో, పరిస్థితి యెలా మారుతూందో నాకు జేరేస్తూ వుండు." అంటూ రెండు పద్ధతులుపదేశించాడు సుబ్బారావు.

కొద్ది రోజులు గడిచిపోయాయి.

ఆ సాయంకాలం యింటికి రాగానే రామ్మూర్తి మొహం నిండా గాంభీర్యం పట్టించుకొని పేపరు చదవసాగాడు.

"అలా వున్నారేం?" అంది సీత.

రామ్మూర్తి యింకా బిగిసి కూర్చున్నాడు మాట్లాడకుండా.

"మాట్లాడరేం? ఏం జరిగింది చెప్పండి! దాచడ మెందుకు?"

"దాచేది నేనుగాదు, నువ్వు."

"ఏం దాచాను? చెప్పి ఋజువు చేశాక అప్పుడు కోపం తెచ్చుకొని శిక్ష వెయ్యొచ్చు. ముందుగా ఆరువు కోప మెందుకు?"

"నిన్న రాత్రి నువ్వేం పలవరిస్తున్నావో తెలుసా? యెవడో అబ్బాయి పేరు. స్పష్టంగా వినబడలేదు."

"అబద్ధాలు చెప్పకండి. ఆడపిల్లలు పుడతారుట!" నవ్వింది.

"నిజం చెప్పు. నువ్వు కాలేజి చదువు వెలగబెట్టావు పైగా పట్నాల్లో ఉండి, ఫాషన్లు వంటబట్టించుకున్న దానివి. నువ్వెవర్నీ ప్రేమించలేదా? పెళ్లి చేసుకోవాలనుకో లేదా?"

"ఎందుకనుకోలేదు? ప్రేమించాను, పెళ్లి చేసుకోవాలను కున్నాను".

"ఎవడ్ని? యిన్నాళ్లూ యెందుకు దాచావు?"

"యిన్నాళ్లూ మీరడగలేదు, నేను చెప్పలేద. యిప్పుడు అడిగారు గాబట్టి చెబుతున్నాను, వినండి అతని గురించి చుట్టాలెవరో చెప్పుకుంటూంటడగా విన్నాను. ఆతర్వాత అస్తమానం అతని గురించే ఆలోచించేదాన్ని. అతని కథలు పడ్డప్పుడల్లా కత్తిరించి అట్టే పెట్టుకొని మళ్లీ మళ్లీ చదివేదాన్ని. మా స్నేహితురాలి అక్కయ్య అతనితో చదువుకొంటుంటే ఆమె స్నేహం కూడా పట్టి అతని వివరాలన్నీ సేకరించాను. ఒకసారి వాళ్ల కాలేజి మాగజిన్లో అతని ఫోటో పడితే ఆమెని బతిమాలి ఆ ఫోటో కత్తిరించి, హాండ్‌బాగ్‌లో దాచుకొని వీలయినప్పుడల్లా చూస్తుండేదాన్ని

"ఎవడువాడు? యిప్పుడెక్కడున్నాడు? యింత కథా నడిపి ఏమెరగనట్టు నటిస్తావేం?' రామ్మూర్తికి నిజంగానే వొళ్లు మండింది.

"ఎంత ఏకాంతమయినా పేరెలా చెప్తాను? అతనున్నది యిదుగో, యీగదిలోనే, యిక్కడే నాకెదురుగా "

"కాయ్!" రామ్మూర్తి తడబడ్తూ చూశాడు.

"మీసంగతేమోగాని నాకు కొయ్యడం అలవాటు లేదు. కావాలంటే ఋజువు చూపిస్తాను. యిదుగో, నేను సేకరించి వోపిగ్గా కలిపి కుట్టిన మీ కథల పుస్తకము. మీఫోటో."

రామ్మూర్తికి, అనుకోకుండా, ఏమూల నుంచో గుర్రాన్ని తెచ్చి 'రాజు, ఆటకట్టు' అన్నట్టయింది. కథ అలా ఉన్నట్టుండి వెనక మొగం పట్టడం రామ్మూర్తి కల్లోకూడా ఊహించని విషయం.

"నాకు నిద్రొస్తోంది." అంటూ లేచివెళ్లి మంచమెక్కాడు.

కొద్దికాలం పోయాక.

డాక్టరు చెప్పిన ఆఖరు పద్ధతి ఒక్కటే శరణ్యమనిపించింది. యిదివరకెప్పుడో రామ్మూర్తి ప్రేమించాడనుకొంటున్న అమ్మాయిని ఊహించుకొని అసూయ పడ్తోంది సీత. సీతకేవిధంగానూ సాటిరాని వో అమ్మాయిని చూపించి ఆమె నేతను ప్రేమించిందని చెప్పేస్తే, యీమెను తల్చుకునా తనింత అసూయ పడ్డది అని సీత నవ్వుకుంటుంది. సంసారం సుఖంగా సాగిపోతుంది. అది డాక్టరు పథకం.

"సీతా, నీకో సంగతి చెప్పాలి. యింతకాలం నువ్వడిగినా యేదో వొంకబెట్టి మాట తప్పిస్తూ వచ్చాను. కాని రోజు రోజుకీ మనం సన్నిహితమవుతున్న కొద్దీ, యీ రహస్యం ఒకటి గూడా నీకు చెప్పాలని పిస్తుంది. యిహమీదట మన యిద్దరి మధ్య యే దాపరికాలు ఉండవు". సీతని ప్రక్కన కూర్చోబెట్టి వో ప్రశాంతమైన సాయంకాలం నెమ్మదిగా మొదలు పెట్టాడు రామ్మూర్తి.

"యిదంతా నాంది యిహ ప్రస్తావన.. యేమనగా" నవ్వింది సీత.

"నీకంతా వేళాకోళంగానే వుంటుంది. కాని యిది నిజంగా చాలా గంభీరమయిన విషయం. ఆ అమ్మాయి మన బంధువుల్లోదే. నాతో కలిసి చదివింది. స్కూల్లో వున్నప్పుడు ఉత్తినే చూసుకొనే వాళ్లం. కాలేజికి వెళ్లాక చాటు చాటుగా కలుసుకొని మాట్లాడుకునేవాళ్లం. నేను పై చదువులకి వెళ్లాక యిద్దరం ఉత్తరాలు గూడా వ్రాసుకొనేవాళ్లం. రకరకాలు కలలు గనేవాళ్లం. గాలిమేడలు గట్టాం...."

"స్వప్న సీమల్లో విహరించారు. విరహగేయాలు పాడారు. మేఘాలు, పావురాయిలు, హంసలు, కాకులు పగైరాల ద్వారా సందేశాలు పంపుకున్నారు. కళ్లు మూసినా తెరచినా మీకు ఆమె, ఆమెకి మీరు తప్పించి యింకేవీ కనబడ్డం మానేశాయి. అదంతా సరే. ఆతర్వాతేమయింది చెప్పండి. యిప్పుడామెక్కడుంది?"

"చెప్పడానికేముంది? లోకం, దేవుడు, విధి, సంఘం, పెద్దలు, అంతా కలిసి వోర్వలేక విజృంభించి మా ఊహా సౌధాన్ని నేలమట్టం చేశారు మారంగుల కలలన్నీ సాయంకాలం యెండల్లా చీకట్లో కలిసి పోయాయి. మాగుజ్జన గూళ్ళని దిక్కుమాలిన కెరటమొకటి దిగమింగింది "

"చ్. చ్ చ్ పాపం! యింతకీ యేమయిందో!".

"వాళ్లనాన్న ఆమెకి పెళ్లి చేసేశాడు. నేనప్పుడు యెక్కడో దూరంగా వున్నాను.

ఆ అమ్మాయి మా ప్రేమ సంగతి చెప్పడానికి

పెగ్గు పడింది. ఇప్పుడామె యీ వూర్లోనే వుంది. ఈసారెప్పుడన్నా కనబడ్తే చూపిస్తాను.' ఆసారి రావడానికి యెంతో కాలం పట్టలేదు. యెవరో చుట్టాలింట్లో పెళ్ళికి పోతే ఆమె కూడా వొచ్చింది. సీతకి చూపెట్టాడు. ఆమె సన్నగా కొంచెం పళ్ళెత్తుగా ఉంటుంది. రామ్మూర్తికి చాలా దూరాన్న బంధువు.

ఆతర్వాత కొన్నాళ్ళు యే గొడవాలేకుండా ప్రశాంతంగా గడిచి పోయాయి. యింక కష్టాలన్నీ తీరినట్టే అనుకుంటున్నాడు రామ్మూర్తి.

వో మధ్యాహ్నంవేళ, యింకా నిద్రలేవకుండానే సీత పల్చింది. "యిగుగో, యిలా వొచ్చి యెవ రొచ్చారో చూడండి" అంటూ.

"ఎవరొచ్చారు?"

"రాధ."

రామ్మూర్తి కర్ధంగాలేదు. సీత విరగబడి నవ్వ సాగింది.

"యింటికి చూడ్డానికి బంధువులొస్తే వొచ్చి పలకరించక ఆ ప్రశ్నలేమిటి? లేచి తొందరగా రండి. .. యిన్నాళ్ళకి పాతస్నేహితుణ్ణిచూడాలని వచ్చారామె. పాపం! శుభ్రంగా మొగం కడిగి పౌడరు పట్టించి నీటుగా తయారయి మరీ రండి.

రామ్మూర్తి కప్పుడే కొద్ది కొద్దిగా అర్థ మవ సాగింది.

"ఏమిటి నువ్వనేది ? ఆమె వొచ్చిందా ? యెందుకు?"

"యెందుకంత ఖంగారు? ఏం, ఆమె రాగూడదా? యెంత అయినా మీ గర్ల్‌ఫ్రెండ్, మాజీ ఫియాన్సీ".

"సుష్. గట్టిగా అనకు. అసలామె యెందు కొచ్చినట్టు?

"యెందుకు రావడమేమిటి? మిమ్మల్నిచూడా లని! నేనే పిలిచాను." సీతకి నవ్వాగడం లేదు.

"సీత, ప్లీజ్. వేళాకోళంగాదు. నేనన్నవేవీ ఆమెతో అనలేదుగద! "

"ఆ అవసరం లేక పోయింది. కాసేపు మాటలు కలిసాక ఆమె తనంతట తానే చెప్పారు, మీకిస్తా మంటే నచ్చలేదన్నారని. సరేనా, యింక రండి."

"డార్లింగ్ ! నువ్వు చాలా మంచిదానివిటు. ఆ గొడవలేవీ ఆమెదగ్గిర యెత్తకేం!" రామ్మూర్తి బతిమాలుకున్నాడు.

"నాకామాత్రం తెలియ దేమిటి? మీరే నేనేదో పసిపిల్లనన్నట్టు చిత్ర విచిత్రంగా అబ ద్ధాలాడి నమ్మించాలని జూస్తున్నారు".

సరే, ఆగడం యెలాగో గడిచింది. రోజులు గడిచిపోతున్నాయి. అసలు సమస్య అలాగే వుండి పోయింది. సీత యిదివరకటికన్నా యెక్కువగా ఆ అమ్మాయి' గురించి అడగడం, యెత్తిపొడ వడం సాగించింది. యీ కష్టాల కవతలివొడ్డు అంటూ కనిపించడం లేదు.

ఒకరోజు.

మధ్యాహ్నం భోజనం దగ్గిర సీత మళ్ళా ఆమాట యెత్తితే రామ్మూర్తికి కోప మొచ్చింది. విసుక్కు న్నాడు. మాట పెరిగింది. చిలికి చిలికి గాలివాన అయింది. రామ్మూర్తి మనసు పాడయింది. మధ్యాహ్నం ఆఫీసులో కూర్చున్నాడన్న మాటే గాని మనసు పనిలో లగ్నం కావడంలేదు. యీ గొడవ కెలాగో లాగ ముగింపు చెప్పాలి. యెలాగ?

యింటికి తిరిగి వస్తున్నాడు. చెయ్యి స్టీరింగ్ మీద, కళ్ళు రోడ్డుమీదా ఉన్నా పరధ్యానం మూలాన త్రాగిన వాడిలాగ అటూ యిటూ తూలుతూ పోతోంది కారు.

ఉన్నట్టుండి, ఏదో క్షణాన్న ఉలిక్కిపడి చూసే సరికి

ఎదురుగ్గా వొదున్నపోతుల బండి వొస్తుంది. దాన్ని తప్పించి పోవాలని దూసుకొస్తున్నసైకిల్ రిక్షా.. యిటు నుంచి మెల్లిగా నిర్లిప్తంగా నెమ రేసుకుంటూ వో అంబోతు. అటు నుంచిపరుగెత్తు కుంటూ రోడ్డుదాటాలని వస్తున్న నాలుగయి దేళ్ల కుర్రాడు.

వెంటనే బ్రేక్ నొక్కాడు. అప్పుడే గట్టిగా వాన జడికొట్టి వెలిశిందేమో, స్కిడ్ అయింది. రిక్షావాడు హఠాత్తుగా ప్రక్కకి త్రిప్పి అంబోతు మీద పడ్డాడు. కారు దున్నపోతుల బండిని అదరగొట్టి, ఫుట్ పాత్‌ని ఢీకొని ఆగింది. పిల్ల వాడు వెనక్కి తిరిగి ఉడాయించాడు. పెద్ద ప్రమాదం జరగ లేదు.

జనం చుట్టూ మూగారు. తలోమాటా అన్నారు. ఆ సన్నివేశంలోంచి బయటపడాలని తెప్ప రిల్లిచూసుకొనే సరికి రామ్మూర్తికి కాలు కదపడం కష్టమయింది. నొప్పి పుట్టింది. యింతలో వెనక నుంచి కృష్ణమూర్తి వచ్చాడు. రామ్మూర్తి కాలు క్షణ క్షణానికి ఎక్కువగా వాచసాగింది. కృష్ణమూర్తి రామ్మూర్తిని హాస్పిటల్‌కి చేర్చాడు. చిన్న ఫ్రాక్చరని, ప్లాస్టరు వేసి, కాలుకదప కుండా కొన్నాళ్ళు హాస్పిటల్లోనే ఉంటే మంచిదన్నాడు డాక్టరు.

రామ్మూర్తి మగతగా మూసుకుంటున్న కళ్ళతో కిటికీలోంచి దూరంగా సీత రావడం గమనించాడు.

"నాకెవరూ తెలియదు. నాకసలు యీ ప్రేమాయణాల అనుభవం లేదు. నామాట నమ్ము సీతా." మధ్య మధ్య మూలుగుతూ అస్పష్టంగా కళ్ళు మూసుకుని కలవరిస్తున్న రామూర్తిని చూడగానే సీత మనసు ద్రవించింది. కళ్లలో నీళ్ళు తిరిగాయి.

"ఏమండీ, ఏమండీ" అంటూ రామ్మూర్తికి మెలుకువ తెప్పించింది.

సీతని చూడగానే రామ్మూర్తి నీరసంగా నవ్వాడు.

"సినిమాల్లో అయితే, వొంట్లో యెక్కడ దెబ్బతగిలినా తలకే ప్లస్ మార్కు పట్టీ వేస్తారు చక్కగా. యీ డాక్టర్లకి చెప్పే డైరెక్టరెవడూ లేక కాలుకి దెబ్బతగిలితే దాన్నే కట్టేశారు."

"చాల్లెండి, హాస్యం! యెంత ప్రమాదం తప్పింది. ! నేనేదో తమాషాకి ఏడిపించాలని యేదో అంటే, మీరది పట్టుకు మనసు పాడుజేసు కొని యాక్సిడెంట్లు చేస్తారా?" కోపంగా బాధగా అని, వొసిరి గట్టిగా చీది రుమాలుతో ఆ కళ్ళూ, ముక్కూ తుడుచుకుంది.

"ఏడిపించడానికని ముందే చెప్తే, కాసేపు నవ్వుకొని సంతోషించేవాణ్నిగా!" అన్నాడు రామ్మూర్తి.

ఆ మర్నాడు చూడ్డానికొచ్చిన డాక్టరు సుబ్బా రావు తో రామ్మూర్తి చెప్పాడు—

"ఒరేయ్, సుబ్బూ, నీవు పుస్తకానికి నో అను బంధం పెట్టి, యింక మీదట చిట్కాలన్నీ విఫల మయితే ఏ కాలో చెయ్యో విరగ్గొట్టుకొనో, యింకోలాగో హస్పిటల్ జేరాలని వ్రాసెయ్యి. ఆదెబ్బతో విరోధాలు వగైరా లన్నీ తుడుచుకు పోతాయి! అంతకన్నా గట్టి మందింకొకటిలేదు!"

మొత్తానికి రామ్మూర్తి కాలు విరిగాక, శుక్రుడు ఆ యిల్లు ఖాళీ చేశాడు. యువతలిపిన్ని దుష్టంగా చూడ్డానికింకెవరూ దొరక లేదు.

రామ్మూర్తి కష్టాలు గట్టెక్కాయి. ●

